వేడుకగా 'ఓరియెంటేషన్ డే'



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓరియెంటేషన్ డే' కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. ఇంజినీరింగ్ విద్యలో అడుగుపెట్టిన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, మల్లారెడ్డి సతీమణి కల్పన, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

పోచారం: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్‌టీఎఫ్‌సీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు ఘట్‌కేసర్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు 1.1 కేజీల గంజాయితో పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో జగిత్యాలకు చెందిన కొత్తూరి రేవంత్ (21), వరంగల్‌కు చెందిన ప్రశాంత్ (21), మోతె సంతోష్ (21) అని పోలీసులు తేల్చారు. కేసు నమోదు చేసి 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మేడ్చల్‌రూరల్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కండ్లకోయ ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డు సమీపంలో బుధవారం మధ్యాహ్నం 45–50 ఏళ్లున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో కేసు నమోదు చేసి, మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

పౌరహక్కుల సమావేశం

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని డబీల్‌పూర్‌లో వార్డు కార్యాలయంలో పౌరహక్కుల సమావేశం నిర్వహించారు. బుధవారం జరిగిన సమావేశంలో తహసీల్దార్ భూపాల్ పౌరహక్కులపై మాట్లాడారు. సమాజంలో పౌరహక్కులకు భంగం కలిగించొద్దని, భంగం కలిగిస్తే చట్టం శిక్షిస్తుందన్నారు. అంటరానితనం నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు, మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రేపు కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్లకు కౌన్సెలింగ్

సాక్షి,మేడ్చల్ జిల్లా: కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంపికైన మెడికల్ ఆఫీసర్ పోస్టుల తుది ఎంపిక జాబితాను మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరీ విడుదల చేశారు. జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఎంపికైన మెడికల్ ఆఫీసర్లు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల జాబితాను జిల్లా కలెక్టర్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ఆమె పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు తగిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆగస్టు 1న ఉదయం 11 గంటలకు తూంకుంట పురపాలక సంఘం పరిధిలోని మేడ్చల్ కలెక్టరేట్‌లో ఉన్న డీఎంహెచ్‌ఓ నిర్వహించ తలపెట్టిన కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ ఉమాగౌరి సూచించారు.

ప్రేమించాలని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

కుటుంబసభ్యులను చంపేస్తానని బెదిరింపు

పోచారం: తనను ప్రేమించకపోతే కుటుంబసభ్యులను చంపేస్తానని ఓ విద్యార్థినిని బెదిరించిన యువకుడిపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం.. బోడుప్పల్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ కొర్రెముల్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని (21)ని పెంబర్తికి చెందిన బంధువు బండ నరేష్ (25) ప్రేమ పేరుతో గతంలో వేధించేవాడు. ఈ విషయంలో ఆమె కీసర పోలీస్‌స్టేషన్‌లో నరేష్‌పై కేసు పెట్టింది. అయినా అతడిలో మార్పు రాలేదు. దీంతో మంగళవారం సాయంత్రం ఆమె కాలేజీ నుంచి హాస్టల్‌కు వస్తున్న క్రమంలో నరేష్ వచ్చి తనను ప్రేమించి పెళ్లి చేసుకోవాలని, కీసరలో పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాడు. దీనికి అంగీకరించకపోవడంతో కుటుంబసభ్యులను చంపేస్తానని బెదిరించాడు. ఆందోళనకు గురైన బాధితురాలు పోచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రహదారి



కరీంగూడ–సాయిగూడెం రహదారి దుస్థితి

చినుకు పడితే చిత్తడే !

- అధ్వానంగా అంతర్గత రహదారులు
- బురదతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

కీసర: చిన్నపాటి వర్షానికే రహదారులు బురదమయంగా మారుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి కీసర, గోధుమకుంట, అహ్మద్‌గూడ, చీర్యాల, రాంపల్లి, నాగారం, దమ్మాయిగూడ తదితర ప్రాంతాల్లో వివిధ కాలనీల్లో అంతర్గత కాలనీ రహదారులు ఇప్పటికి మట్టి రోడ్లే. ఈ రహదారులకు మరమ్మతులు చేయాలని పలుసార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

◆ కీసరలోని పలు కాలనీల అంతర్గత రహదారులు చిన్నపాటి వర్షం పడితే వరద నీరు నిలిచి రోజుల తరబడి బురదమయంగా ఉన్నా.. రహదారుల గుండా వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తుంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న మట్టి రహదారులను సీసీరోడ్లుగా మార్చాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

◆ కీసర ప్రధాన రహదారి, కరీంగూడ రహదారి, కరీంగూడ–సాయిగూడెం, కీసర– నాకల గూడెం తదితర రహదారుల్లో కుడా గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తోంది. ఈ రహదారులకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. సీసీరోడ్లు మంజూరైన కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు ప్రారంభించని చోట మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సీసీరోడ్డు పనులు చేపట్టేలా తగిన చర్యలు తీసుకోవాలి. దీనితో పాటు కాలనీల్లో విద్యుత్‌దీపాలు, తదితర మౌలిక వసతుల కల్పనకు కుడా అధికారులు చర్యలు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



కీసరలోని వివిధ కాలనీల్లోని అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి అధికారులకు వినతిపత్రాలు అందజేసిన స్పందించడం లేదు. చిన్నపాటి వర్షం పడితే చాలు కాలనీల్లోని రహదారులన్నీ బురదమయంగా మారుతున్నాయి. కీసరలోని కృష్ణానగర్ కాలనీలో సీసీరోడ్డు పనులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదు. సీసీరోడ్డు వేసేందుకు రోడ్డును తవ్వి వదిలేశాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీరోడ్డు వేయాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణానగర్ కాలనీ

అధికారులు స్పందించాలి



నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలోని వివిధ గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కాలనీల అంతర్గత రహదారులను బాగు చేసేందుకు మున్సిపల్ అధికారులు చొరవ తీసుకోవాలి. నిధులు మంజూరు చేసి అవసరమైన కాలనీల్లో యుద్ధప్రాతిపదికన రోడ్డు పనులు ప్రారంభించాలి.

– తిరుమల్‌రెడ్డి, చీర్యాల

గురుకుల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

జిల్లా కలెక్టర్ మను చౌదరి

కీసర: గురుకుల పాఠశాల, కళాశాలలోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. బుధవారం కీసరలోని గురుకుల రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు మెను ప్రకారం ప్రతిరోజు సమయానికి పౌష్టికాహారాన్ని అందించాలని, వసతిగృహంలో అందుతున్న విద్యాబోధనపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్మీడియట్, పదోతరగతిలో గతేడాది కంటే ఈ విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

టెక్నాలజీపై అవగాహన..

విద్యార్థులకు మారుతున్న టెక్నాలజీపై అవగాహన కల్పించి నైపుణ్యం, సామర్థ్యాన్ని పెంపొందించాలని సంబంధిత బోధన సిబ్బందికి సూచించారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి గణితశాస్త్రాన్ని భోదిస్తూ విద్యార్థులతో బోర్డుపై లెక్కల సమాధానాలను చేయించారు. అనంతరం వంటగదిని సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యతతో కూడిన ఆహారపదార్థాలను తయారుచేయాలని కలెక్టర్ సూచించారు. దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, జిల్లా పాఠశాలల కన్వీనర్ రజనీకాంత్, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, వ్యవసాయశాఖ అధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

ఫర్టిలైజర్ షాపు ఆకస్మిక తనిఖీ

కీసరలోని ఓ ఫర్టిలైజర్‌షాపును జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియాను రైతులు అధికంగా వినియోగిస్తున్నారని, ఇతర ఎరువులపై కూడా వారికి పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. దీనికనుగుణంగా రైతులందరికీ ఎరువులు, పురుగు మందులు వినియోగించడంపై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని వ్యవసాయాధికారులు, షాప్ సిబ్బందికి సూచించారు. నకిలీ మందులు, ఎరువులు విక్రయించకుండా వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

కలెక్టర్ మనుచౌదరితో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడి, ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం తూంకుంట పురపాలక సంఘం పరిధిలోని మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరిని ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, వాటిని ప్రజా అవసరాల కోసం వినియోగించాల్సిన పలు అంశాలపై కలెక్టర్ మనుచౌదరితో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో 6 అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్లు, లైబ్రరీలకు 15వ ఆర్థిక సంఘం నుంచి సరిపడా నిధులు మంజూరై ఉన్నాయని, భవన నిర్మాణాలు చేపట్టడానికి స్థానికంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. కబ్జా భారిన పడుతున్న ప్రభుత్వ భూములను కేటాయిస్తే జీహెచ్ఎంసీ వెంటనే యూపీహెచ్‌సీలు కట్టడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

◆ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ప్రభుత్వ భూమిని కేటాయించాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించామని, వాటిని స్వాధీనం చేసుకుని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు కేటాయిస్తే జీహెచ్ఎంసీ నిర్మించగలదన్నారు.

◆ జీవో 58, 59 కింద దరఖాస్తు చేసుకున్న పేదలను గుర్తించి, దరఖాస్తులను మరోసారి పరిశీలించి, జీవో 59 కింద డబ్బులు చెల్లించిన వారికి రెగ్యులరైజేషన్ చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని గతంలో సీఎంఓలో ఇచ్చిన పలు వినతులకు సీఎం కార్యాలయం నుంచి స్పందన లభించిందని, దీనికి సంబంధించి నివేదికను కూడా జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు ఆయన చెప్పారు.



కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, అధికారులు

కబ్జాల భూములివే..

నియోజకవర్గంలో కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను రక్షించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సర్వేనెంబర్ 844లో ఉన్న 55 ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుందన్నారు.

◆ హైదరాబాద్– మేడ్చల్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న కోట్లాది రూపాయల విలువైన భూములకు భౌగోళిక సరిహద్దులు సూచించకపోవడంతో కబ్జాలకు గురౌతున్నాయన్నారు. ఈ స్థలంలో నవోదయ స్కూల్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

◆ హిల్‌టాప్ కాలనీలోని సర్వే నంబర్ 844లో ఉన్న ప్రభుత్వ భూమిని అంగన్‌వాడీ సెంటర్ లేదా మహిళా భవన్ కేటాయించాలని కోరారు.

◆ టెలికాం కాలనీ వినోబానగర్‌లోని సర్వేనెంబర్ 278, యాప్రాల్‌లోని సర్వేనెంబర్ 171, సర్వేనంబర్లు 582, 583లలో ఉన్న ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురికాకుండా పరిరక్షించి, ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలని కోరారు. బీఆర్ఎస్ నేతలు అనిల్ కిషోర్‌గౌడ్, సునీత, రమేష్, నరేందర్‌రెడ్డి, చిన్నయాదవ్, పరీ్వన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఘట్‌కేసర్: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలోని 6వ వార్డులో కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్ ముత్యాలుయాదవ్‌తో కలిసి బుధవారం ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇళ్లులేని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ఆంజనేయులు యాదవ్, ఫరూక్, సిరాజ్, సత్తిరెడ్డి, రహమాన్, నర్సింగ్‌రావు, గణేష్‌యాదవ్, సాయియాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేడ్చల్: పట్టణంలోని 23వ వార్డులో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి మాజీ కౌన్సిలర్ కొడే మహేష్‌తో కలిసి పనులు ప్రారంభించారు. మున్సిపల్, హౌజింగ్ అధికారులతో కలిసి నాయకులు భూమిపూజ చేశారు. అర్హులందరికీ మరోసారి పరిశీలించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని అధికారులు తెలిపారు. మున్సిపల్ అధికారులు రాంచందర్, శ్రీనివాస్, వికాస్, మమత, కాంగ్రెస్ నేతలు శంకర్, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో పనులను ప్రారంభిస్తున్న పావనీ

'కేపీఆర్ఐటీ' అంతర్జాతీయ ఒప్పందం

ఘట్‌కేసర్: ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ అటానమస్ కళాశాల (కేపీఆర్ఐటీ) విద్యార్థుల భవిషత్ కోసం బుధవారం అంతర్జాతీయ ఒప్పందం చేసుకుంది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విక్టోరియన్ ఇంజినీరింగ్ విద్యాసంస్థల ప్రతినిధులతో కలిసి భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ మేరకు కళాశాలలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అనంతరం కేపీఆర్ఐటీ వైస్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్, డైరెక్టర్ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ ఒప్పందంతో విద్యార్థులకు గ్లోబల్ స్కోప్, ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్, అత్యాధునిక టెక్నాలజీ అభ్యసించడానికి అవకాశం లభిస్తుందని, విద్యార్థుల భవిషత్తుకు ఈ ఒప్పందం మైలురాయిగా నిలుస్తుందన్నారు. కేపీఆర్ఐటీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనాథ్ కశ్యప్, కార్పొరేట్ రిలేన్స్ డీన్ అనిష్ శ్రీవాస్తవ్, విక్టోరియల్ ఇంజినీరింగ్ విద్యాసంస్థ సీఈఓ అర్జున్, కేఆర్ కన్సల్ట్, సీఈఓ, ఫౌండర్ రోహిత్‌రావు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ ప్రశాంత్

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

జవహర్‌నగర్: తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సంఘం నాయకులు బుధవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ రామసుబ్రహ్మణ్యన్‌ను కలిశారు. ఈ సందర్భంగా టీవీహెచ్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ మాట్లాడుతూ.. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల్లో దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులను ఏర్పాటుచేయాలన్నారు. తీవ్ర వైకల్యం గల సహాయకులకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. 80 శాతం వైకల్యం కలిగిన వారికే కేంద్ర పథకాల్లో బ్యాటరీ సైకిల్స్, పెన్షన్ ఇవ్వడం అన్యాయమని, 40 శాతం వైకల్యం ఉన్న సంక్షేమ పథకాలకు అర్హులను చేయాలని విన్నవించారు. మెరుగు కృష్ణ, రమేష్, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.



జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్మన్‌తో దివ్యాంగులు

మున్సిపల్ వర్కర్స్ నూతన కమిటీ ఏకగ్రీవం

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (డీఎండబ్ల్యూయూ–సీఐటీయూ) విస్తతస్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ప్రజాతంత్ర ఉద్యమ నాయకురాలు వినోద ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బంగారు నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులుగా డప్పు కృష్ణ, చెన్నూరు కృష్ణ, ముక్కెర కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గడ్డం వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా అశ్విని, రాజేశ్వరి, సంయుక్త కార్యదర్శులుగా ఎడ్ల రాములు, వెంకటేష్, యాదమ్మ, మాతమ్మ, లక్ష్మి, వీరేష్, కోశాధికారిగా మోత్కుపల్లి రాములమ్మ, సభ్యులుగా సుధాకర్, యాదగిరి, రాజు, సుధాకర్, నర్సింగ్‌రావు, ప్రకాష్, దేవేందర్, మల్లేష్, రాణి, ప్రభాకర్, నాగరాజు, పరుశరాం, శశిరేఖ, భారతి, శ్యామలను ఎన్నుకున్నారు.



ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్‌గా బాలస్వామి

ఘట్‌కేసర్: నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాలస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన పరశురాం రాచకొండ కమిషరేట్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కాగా.. మేడిపల్లి డీఐగా పనిచేస్తున్న బాలస్వామి ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని, శాంతిభద్రతల విషయమై సహకరించాలని కోరారు.

ఆలయ వార్షికోత్సవం

కీసర: నాగారం మున్సిపాలిటీ రమా సహిత స్వామి, షిర్డీసాయిబాబా, పోచమ్మ దేవస్థానం 17వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రమా సహిత సత్యనారాయణస్వామి విశేష అభిషేకం, గటాభిషేకం, పుష్పాలంకరణ, ధూప, దీప, విశేష అర్చనలు, గణపతి పూజ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



అంజయ్య

జవహర్‌నగర్: ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్శిగుట్ట గంగపుత్రకాలనీలో నివసించే విజయ్‌కుమార్ తండ్రి అంజయ్య(62)ను ఈనెల 11న కొకూర్‌లోని బంధువుల ఇంట్లో వదిలివెళ్లారు. 16న విజయ్‌కుమార్ తండ్రిని బైక్‌పై ఇంటికి తీసుకెళ్తుండగా.. జవహర్‌నగర్‌కు రాగానే వారిద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో అంజయ్య వాహనం దిగి వెళ్లిపోయాడు. అంజయ్య ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం

- కలెక్టర్ ఆదేశాలతో మండలాల వారీగా ఆరా
- భూముల రక్షణే లక్ష్యంగా రెవెన్యూ శాఖ సన్నద్ధం
- పలు వివాదాల్లోని ప్రభుత్వ భూమి 12,073 ఎకరాలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను కబ్జాదారుల నుంచి పరిరక్షించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక వ్యూహంపై దృష్టి సారిస్తోంది. భూ కబ్జాలపై ప్రజావాణితో సహా ఎమ్మెల్యేలు, పలువురి ఫిర్యాదులు అధికార యంత్రాంగానికి అందుతుండటంతో వాటిని కాపాడే బాధ్యత తహసీల్దార్ దేనని పలు సమీక్షల్లో ఆదేశాలిచ్చిన కలెక్టర్ మనుచౌదరి క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ,అసైన్డ్ భూములపై మండలాల వారీగా ఆరా తీస్తున్నారు. – సాక్షి, మేడ్చల్ జిల్లా

అందుబాటులోకి 'కేఎంఎల్' మ్యాప్..

కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి వీఆర్‌ఓ, వీఆర్ఏలను గ్రామ రెవెన్యూ అధికారులుగా పునః ప్రవేశం చేయించడం ద్వారా ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో భూముల పరిరక్షణకు పైలెట్ ప్రాజెక్టు కింద సర్వే నిర్వహించి, సాంకేతికంగా కిహోల్ మార్కప్ లాంగ్వేజ్ (కేఎంఎల్) మ్యాప్, (గూగుల్)లో పొందుపరిచే చర్యలను జిల్లా అధికార యంత్రాంగం చేపట్టింది. ప్రభుత్వ, అసైన్డ్ భూములను సంరక్షించే బాధ్యత ఆర్ఐ, డీటీ, తహసీల్దార్‌పైనే ఉందని పేర్కొంటున్న యంత్రాంగం గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీ, ఫెన్సింగ్ వంటి రక్షణ చర్యలపై దృష్టి సారిస్తోంది.

కబ్జాదారుల కబంధ హస్తాల్లో..

జిల్లాలోని 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూశాఖ ఇందులో ఎన్ని.. భూములు కబ్జాకు గురయ్యాయి. ఎంత సంరక్షణలో ఉందన్న సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. బాలానగర్ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది.

◆ శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపల్లి మండలంలో 900 ఎకరాలు, ఘట్‌కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు, బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డులు చెబుతున్నాయి.

అసైన్డ్ భూములు ఎక్కువే...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2004కు ముందు 116 రెవెన్యూ గ్రామాలు, పలు ప్రాంతాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లబ్ధిదారులకు 11,384 ఎకరాల ప్రభుత్వ భూములను అసైన్డ్ చేశారు. ఈ అసైన్డ్ భూములన్నీ పంటసాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు.

◆ ఘట్‌కేసర్ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలంలోని 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలంలోని 16 గ్రామాల్లో 1500 ఎకరాలు, మేడ్చల్ మండలంలోని 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్ మండలంలోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం నిర్ణయంతో రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేయగా.. ఇందులో చాలా మేరకు వెంచర్లు, అపార్ట్‌మెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రులు వెలిశాయి.

కోర్టు కేసుల్లోనూ అధికమే...

మేడ్చల్ జిల్లాలో భూ సంబంధిత కోర్టు కేసులు 706 ఉండగా.. ఇందులో మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో 349, కీసర డివిజన్‌లో 357 ఉన్నట్లు తెలుస్తోంది. వివిధ కోర్టుల్లో ఉన్న కేసుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సుప్రీంకోర్టులో 1 కేసు ఉండగా.. హైకోర్టులో 481, జిల్లా కోర్టులో 65, లోకాయుక్త కోర్టులో 57, ఎల్‌డీ కోర్టులో 63, సివిల్ కోర్టులో 6 కేసులు కొనసాగుతున్నాయి. కోర్టు దిక్కారంలో 35 ఉన్నట్లు రెవెన్యూశాఖ రికార్డులు చెబుతున్నాయి.

వివాదంలో చిక్కిన భూములివే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూవివాదాలు అధికంగా ఉన్నాయి. రెవెన్యూశాఖ రికార్డుల ప్రకారం వివాదాస్పద భూములు 12,073.17 ఎకరాలు ఉన్నాయి. ఇందులో సివిల్‌కోర్టు పరిధిలో వివాదంలో ఉన్న భూములు 2,485 ఎకరాలు కాగా.. రెవెన్యూ కోర్టు పరిధిలో 904 ఎకరాలు, ఇతర వివాదాలతో పాటు ఎండోమెంట్, వక్ఫ్, ఫారెస్ట్, వ్యక్తిగత వివాదాల పరిధిలో 2,466 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖ పేర్కొంటోంది. అసైన్డ్ భూముల కేటాయింపుల్లోని 1603 ఎకరాల భూములు కూడా వివాదాల్లో ఉన్నట్లు సమాచారం.

◆ జిల్లాలో 5,837 ఎకరాల వివాదాస్పద భూముల వివరాల లెక్క తేలగా.. మిగతా 6,236 ఎకరాలకు సంబంధించిన వివాదాస్పద భూముల వివరాలను రెవెన్యూశాఖ గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.